www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 సెప్టెంబర్ 2023

5



కోనసీమ

రాజమహేంద్రవరంలో హై అలర్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎసిబి కోర్టు ఈ నెల 22వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరంలో హైఅలర్ట్ ప్రకటించారు. విజయవాడ ఎసిబి కోర్టు నుంచి ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించే క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తారనే సమాచారాన్ని అందుకున్న తూర్పు గోదావరి జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.రాజమహేంద్రవరం నగరానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి టిడిపి నేతలు, శ్రేణులు రాకుండా ఎక్కడకక్కడ పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. నగరంలోకి ప్రవేశించే అన్ని ప్రధాన రహదా రులతో పాటు, ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. నగరం చుట్టు పక్కల ప్రాం తాలతో కలిపి ఏకంగా 36పోలీసుపికెట్లను ఏర్పాటుచేసినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి.

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

- పునాదుల్లోనే పాఠశాల భవనం
- ముందుకు సాగని నిర్మాణ పనులు
- పూర్తి చేయాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని మనబడి నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన రెండవ విడత నాడు-నేడు పనులు ముందుకు సాగడంలేదు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు, పాఠశాలల విలీనం నేపథ్యంలో పెరిగిన విద్యార్థుల సంఖ్య తదితర సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 68 పాఠశాలలు ఉండగా మొదటి విడతలో 24 పాఠశాలలను ప్రభుత్వం ఇప్పటికే అభివృద్ధి చేసింది. రెండవ విడతలో స్థానిక ఏడిద రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు 9 ఉన్నత, 28 మండల పరిషత్, 10 మున్సిపల్, 9 అంగన్‌వాడీ కేంద్రాలు మొత్తంగాను 57 పాఠశాలలో సుమారుగా రూ.14.14కోట్లతో అభివృద్ధి పనులను అధికారులు చేపట్టారు. వీటిలో ప్రధానంగా మేజర్, మైనర్ రిపేర్లతో పాటు డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, గ్రీన్ చార్ట్ బోర్డు, ఫర్నిచర్, విద్యుత్తు మరమ్మతులతో పాటు అదనపు తరగతి గదులు నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఇప్పటికి వరకు ప్రభుత్వం రూ4.30 కోట్లు విడుదల చేయగా రూ.3.83 కోట్లను ఖర్చు చేసారు.

రూ.8.11 కోట్లతో అదనపు తరగతుల నిర్మాణం

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు, పాఠశాలల విలీనం నేపథ్యంలో పెరిగిన విద్యార్థుల సంఖ్య, తదితర సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని మనబడి నాడు నేడులో భాగంగా సుమారు రూ.8.11 కోట్ల అంచనాలతో 22 పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన 71 అదనపు తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పట్టణంలో జిల్లా పరిషత్ బాలకోన్నత, గొల్లపుంత, సత్యశ్రీ సెంటర్‌లోని సర్దార్ శ్రీవేగుళ్ళ వీర్రాజు, శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాలలు కాగా మండలంలోని ద్వారపూడిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్), జిల్లా పరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలలతోపాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెలగతోడు, తాపేశ్వరం, కేశవరం, ఉన్నత పాఠశాలలు, ఏడిద, చిన్నద్వారపూడి, మెర్నిపాడుల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొత్తంగాను 71 తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పునాదుల నుంచి నిర్మిస్తున్న ఒక్కొక్క తరగతి గది నిర్మాణానికి ప్రభుత్వం రూ.13.5లక్షలు, శ్లాబ్‌పైన అయితే రూ.12 లక్షల నిధులు కేటాయిం చింది. పాఠశాలలు తెరిచినప్పటికి అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు సౌకర్యాల లేమి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.



ద్వారపూడిలో పునాదుల్లోనే ఉన్న పాఠశాల భవనం



ద్వారపూడిలో భవనానికి పుటింగ్ వేసేందుకు ఉంచిన ఇనుము

పునాదుల్లోనే పాఠశాల భవనం

మండలంలోని ద్వారపూడి గ్రామంలోని సచివాలయం చెంతనే ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) రూ.43,99,951 తో విద్యార్థులకు ఆహారపదార్థాలు వండేందుకు కిచెన్ షెడ్డు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికి వరకు రూ.11,78,460 ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాయి.

అయితే మరుగుదొడ్ల నిర్మాణ పనుల శ్లాబ్ వరకు రాగా రెండు నెలలుగా అదనపు తరగతులు నిర్మాణ పనులు నిలిచి పోయాయి. పాఠశాల ఆరుబయటే నిర్మాణ సామగ్రి ఉంచారు. అయితే కిచెన్ షెడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల భవనంలోని వరం డాలోనే వంట వార్పు పనులు జరుగుతున్నాయి. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాము



ప్రభుత్వ పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా మనబడి నాడు-నేడు పనులు ప్రభుత్వం చేపట్టింది. నాడు-నేడు పనులు రెండవ విడతలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తాము.

-నాయుడు రామచంద్రరావు, ఎంఇఒ, మండపేట

సూర్యకాంతంకు పలువురి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు



సంస్మరణ సభకు హాజరైన బంధువులు, గ్రామస్తులు

- సూర్యకాంతం సంస్మరణ సభలో పాల్గొన్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - అంబాజీపేట

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు గోసంగి బేబీరాణి మాతమూర్తి సూర్యకాంతం సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నందంపూడి స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర స్టేట్ జనరల్ సెక్రటరీ సిహెచ్.నరసింగరావు, సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు కారుసాల సుబ్బరావమ్మలు మాట్లాడుతూ సూర్యకాంతం పార్థీవదేహాన్ని వైద్య సేవలకు అందించడమే కాకుండా ఆమె కుటుంబ సభ్యులు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాల ద్వారా సేవలందిస్తున్నారని అన్నారు. మాతమూర్తి మరియు అత్త లను వద్ధాప్యంలో చిన్నపిల్లలా చూసుకోవడం హార్షణీయమని బేబీరాణిని కొనియాడారు. తన నేత్రాలను దానం చేయడం ద్వారా లోకాన్ని చూస్తున్న నేత్రదాత అమరజీవి సూర్యకాంతం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్‌పిఐ రాష్ట్ర నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు బచ్చల కామేశ్వరరావు, కష్ణ మూర్తి, కుటుంబ సభ్యులు గోసంగి సంపతరావు, గోసంగి సత్యనారాయణ, మానుకొండ నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి, పీతల రామచంద్రరావు, సిపిఎం కాకినాడ నగర నాయకులు పలివేల వీరబాబు, పిల్లి రామకృష్ణ సభలో పాల్గొన్నారు.

'జగనన్నసురక్ష'తో ప్రజల వద్దకే ఆరోగ్యసేవలు

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి-ఆలమూరు

త్వరలోనే రాష్ట్రం మొత్తం 45 రోజుల పాటూ ప్రతి గ్రామ, వార్డ్ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సిఎం జగన్ నిర్వహించి, ప్రజల వద్దకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో రూ.5.98 కోట్లతో సమూలంగా రూపురేఖలు మార్చి తీర్చిదిద్దిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆదివారం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్యాలకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. మనబడి నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని, నాడు-నేడు పథకంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వంలో ఎన్నో అభివద్ధి పనులు చేపట్టిందన్నారు. కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ర్యాలి పిహెచ్‌సి భవనాలను అతి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



30 పడకల సిహెచ్‌సిని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి



ఏడిద కొత్తూరులో పగలే వెలుగుతున్న వీధిలైటు

పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

ప్రజాశక్తి-మండపేట

విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, నాణ్యమైన వెలుగులు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎల్ ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వీధి దీపాలు, రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. అనేక సమయాల్లో రాత్రి, పగలు తేడాలేకుండా విద్యుత్ దీపాలు వెలగడంతో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. నిత్యం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతంలో ఈ వీధి దీపాలు ఇలాగే వెలుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మండపేట-ఏడిద ప్రధాన రహదారిలో కొన్ని లైట్లు పగలు వెలుగుతుండగా మరికొన్ని లైట్లు మరికొన్ని రాత్రులు వెలగడంలేదని స్థానికులు చెబుతున్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై టిడిపి శ్రేణుల నిరసన



తాటిపాకలో సామూహిక నిరాహార దీక్ష చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి, నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అవినీతికి సంబంధించిన కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు శనివారం అరెస్ట్ చేసిన విషయం విదితమే. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు రిలేనిరాహార దీక్షలు, నిరసనలు చేపట్టారు.

మండపేట చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజాస్వామికంగా, రాజకీయ కక్ష సాధింపుతోనే చంద్రబాబు నాయుడు అరెస్టు జరిగిందని అన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ అరెస్టును ఖండించాలన్నారు. ప్రభుత్వం, న్యాయస్థానాలు చంద్రబాబును బేషరతుగా విడుదల చేయకపోతే వాడవాడలా ఉదాహరణ దీక్షలు చేపడతామన్నారు. ఉవ్వెత్తున ఒక ప్రజా ఉద్యమంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, సల్మాన్, గుండు వీరతాతరాజు, పిల్లా తాతాలు, మచ్చ నాగు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు(పి.గన్నవరం)** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పి.గన్నవరం ప్రధాన జంక్షన్ లో ఆదివారం నియోజకవర్గ టిడిపి శ్రేణులు సత్యాగ్రహ దీక్ష ప్రారంభించారు. పి.గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ నామన రాంబాబు మాట్లాడుతూ ప్రజాస్వామికంగా రాజకీయ కక్ష సాధింపు తోనే చంద్రబాబు అరెస్టు జరిగిందన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్ టిడిపి అధినేత చంద్ర బాబు అరెస్టు చేసిన తీరును నిరసిస్తూ శిరోమండనం చేయించుకుని ప్రభుత్వం సిఐడి తీరుకు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డొక్కా నాగబాబు, చిట్టూరి శ్రీనివాస్,డి.శ్రీనురాజు, ఆరుమిల్లి లాల బాబు, డివివి. సత్యనారాయణ, గణపతి రాఘవులు, మొల్లేటి శ్రీనివాస్, బొండాడ నాగమణి, జి.నాగమణి, మట్టపర్తి భారతి,చిన్నం విజయారావు, మందపాటి అనితా కిరణ్ కుమార్, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ ను ఆదివారం భీమనపల్లిలోని ఆయన స్వగృహంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ తన ఇంటి వద్దే నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. సాయంత్రం టిడిపి నాయకుడు ఆకేటి బాబులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. లక్ష్మీనారాయణ దీక్షకు టిడిపి నాయకులు గుత్తుల నాగేశ్వరరావు, మంచెం బుజ్జి, ఆకేటి పెద్ద, యాళ్ల సత్తిబాబు, ఆకుల కృష్ణమోహన్, జంపన శ్రీనివాసరాజు, పెయ్యల తిరుమలరావు, చెన్నూరి దుర్గారావు తదితరులు సంఘీభావం తెలిపారు. అనంతరం సిఎం జగన్ కు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. **అమలాపురం** చంద్రబాబుకు అరెస్ట్‌కు నిరసనగా అమలాపురంలో టిడిపి నేతలు ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు నివాసం వద్ద మాజీ ఎంఎల్‌ఎ ఆనందరావు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు.నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి టిడిపి శ్రేణులు సైకో పోవాలి సైకిల్ రావాలి సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. **రాజోలు** చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు సుమారు 150 మంది కార్యకర్తలతో కలిసి ఆదివారం తాటిపాక లోని తమనివాసంలో సామూహిక నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజాస్వామికంగా, రాజకీయ కక్ష సాధింపుతోనే చంద్రబాబు అరెస్టు జరిగిందన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ అరెస్టును ఖండించాలన్నారు.



రిలే నిరాహార దీక్షలో మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, పార్టీ శ్రేణులు



లక్ష్మీనారాయణ నిరసన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు



పి.గన్నవరం ప్రధాన సెంటర్‌లో నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు



అమలాపురంలో మెట్ల రమణబాబు నివాసం వద్ద టిడిపి నాయకుల నిరసన

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. కడియం మండలం మాధవ రాయుడుపాలెంకు చెందిన లింగేశ్వర రావు, మాధవి దంపతులు రూ.10,116, మెదక్ జిల్లా తెళ్ళాపూర్‌కు చెందిన ఆర్.సుబ్రహ్మణ్యం,రోజా దంపతులు రూ.38,700, రావులపాలెం మండలం వేదిరేశ్వరానికి చెందిన యం.లక్ష్మీ కుమార్ రాజా రూ.20 వేలు విరాళాలుగా అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన పి.నాగార్జున, సూర్య వీరవేణి దంపతులు రూ.10 వేలు, పవన్ కుమార్, ఫణి కుమారి దంపతులు రూ.10,120, పాలకొల్లుకు చెందిన ఆర్.రామ వెంకట సదాసాయి అభిషేక్ రూ.10,116, రావుల పాలెం మండలం వేదిరేశ్వరానికి చెం దిన కాశీ విశ్వనాథరాజు, శారదాదేవి దంపతులు రూ.11,116 విరాళాలను ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఇఒ ఎం.సత్య నారాయణ రాజులకు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మట్టి వినాయకుని పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిసోర్సు పర్సన్ మూర్తి అన్నారు ఆదివారం ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామం అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద వినాయక చవితి సందర్భంగా చిన్నారులకు మట్టి వినాయకుడని తయారు చేయడంతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు మట్టితో వినాయకులను తయారు చేసి పర్యావరణాన్ని కాపాడదాం మట్టి వినాయకుని పూజిద్దాం అనే నినాదా లు చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు శ్యామ్ జాదుగర్, అన్నపూర్ణ, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మీ నాయకుడి మీద సిబిఐ కేసులే ఉన్నాయ్.. అదే మా నాయకుడు మీదైతే సిఐడి, ఎసిబి, ఇడి కేసులన్నాయ్.. మా నాయకుడే గొప్ప..!!

'న్యాయస్థానాల ముందు అందరూ సమానమే'

ప్రజాశక్తి-రామచంద్రపురం

న్యాయస్థానాల ముందు అందరూ సమానమేనని చట్టాలు ఎవరికీ అతీతం కాదని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా రూ.371 కోట్లు దుర్వినియోగంపై సిబిఐ సూక్ష్మంగా పరిశీలించిన తర్వాత కేసు నమోదు చేసిందని, అందుకనే ప్రత్యేక చంద్రబాబుకు రిమాండ్ విధించారన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసులో చంద్రబాబు దొరికిపోయారన్నారు. ఆర్థిక నేరాలు పాల్పడిన వారికి న్యాయస్థానాల్లో శిక్షలు తప్పవని ప్రజలకు న్యాయస్థానాలపై నమ్మకం ఏర్పడిందని న్యాయమే గెలిచిందని మంత్రి వేణు వ్యాఖ్యానించారు. ఎప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు తన నిర్దోషిత్వాన్ని కోర్టులో నిరూపించుకోవాలని మంత్రి సూచించారు.

జనసేన కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-మామిడికుదురు

లూటుకుర్రులో జనసేన పార్టీ సభ్యత్వ కిట్లను ఆదివారం సర్పంచ్ అడబాల తాతకాపు సభ్యులకు పంపిణీ చేశారు.మొదటి సభ్యత్వ కిట్టును గోకవరపు నాగేశ్వరరావు, విళ్ళ సుబ్బారావు లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు బొంతు చంద్రశేఖర్, అడబాల చిన్ని, పాలూరి పెద్దిరాజు, మరియు గ్రామ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం స్థానిక ఆదిత్య పాఠశాల కామనగరువు విద్యార్థినీ విద్యార్థుల యొక్క గ్రాండ్ పేరెంట్స్ సమావేశ కార్యక్రమం ఆదివారం పాఠశాల ఆవరణలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.రామ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ సుధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి.రామ ప్రసాద్ గ్రాండ్ పేరెంట్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ మన వారసత్వ సంపదని, వారిని గౌరవించడం అనేది మహాభాగ్యమని చెపుతూ మీ మనుమలకు, మనుమరాండ్రకు చక్కని విలువలతో కూడిన మాటలు చెప్పడం లో మీరెప్పుడూ ముందుంటారని ఆశిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొనిన విద్యార్థుల యొక్క గ్రాండ్ పేరెంట్స్ ను సత్కరించడం తో పాటు వారికి వివిధ ఆటలపోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులతో పాటు ఆదిత్య విద్యాసంస్థల యాజమాన్యం అందించిన చిరు కానుకలను అందించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థుల యొక్క గ్రాండ్ పేరెంట్స్ కు ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిప చలపతి రావు అభినందనలు తెలియజేశారు.



పాల్గొన్న ఆదిత్య పాఠశాల యాజమాన్యం, ప్రముఖులు

పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పురపాలక సంఘంలో ప్రధాన నీటి ట్యాంక్ మరమ్మతుల కారణంగా 30 రోజులపాటు పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు మంచినీటి సరఫరా అంతరాయం కలుగవచ్చునని మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయకుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నీరు మురికిగా ఉన్న కారణంగా నీటిని కాచి చల్లార్చి తాగాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఐలమ్మ చిత్రపటం నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణా ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రజక కులంలో పుట్టిన వీరవనిత చాకలి ఐలమ్మ 38వ వర్థంతి కోటిపల్లి లో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం నాయకుడు కొత్తపల్లి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఐలమ్మ చిత్రపటానికి మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు, అముజూరు గ్రామ సర్పంచ్ నానారపు కల్యాణి శ్రీనివాస్, కొత్తపల్లి ప్రసాద్, ధర్మవరపు ఏడుకొండలు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనంతరం ఆమె చేసిన త్యాగాలను కొనియాడారు. సమస్యలపై పోరాడే మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామంత కుర్తి సత్యనారాయణ, గంటి సుబ్రమణ్యం, అంగాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాల్లో ఈ నెల 11న సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయి సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో అర్జీదారులకు విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు


పిడిఎఫ్ బియ్యం స్వాధీనంచేసుకున్న విజిలెన్స్ అధికారులు

పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో ఆదివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవ చేసిన 5 టన్నుల పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు .గ్రామంలోని గంటా సాయిబాబు ఇంటిలో 96 ప్లాస్టిక్ బస్తాల్లో నిలువ చేసిన బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎంఎస్‌ఓ విజయకుమారి తెలిపారు. ఈ బియ్యం విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఈ బస్తాలను సీజ్ చేసి 6ఎ కింద కేసు నమోదు చేసినట్లు ఎంఎస్‌ఓ విజయకుమారి తెలిపారు.ఈ దాడుల్లో విజిలెన్స్ సిఐ ఎన్.రమేష్, విఆర్‌ఓ వెంకటేశ్వరరావు, జివిఎస్ లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సారాను స్వాధీనం చేసుకున్న దృశ్యం

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో సారా బట్టీపై ఎస్ఇబి పోలీసులు దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన గండిపోయిన వీర మహేంద్ర అటవీ ప్రాంతంలో సారా బట్టీలు నిర్వహిస్తున్నాడని అందిన సమాచారం మేరకు ఎస్ఈబి పోలీసులు సారాబట్టీపై దాడి చేశారు. ఈ సందర్భంగా 33 లీటర్ల సారా, ఒక మోటర్ బైక్ కు స్వాధీనం చేసుకుని, 600 లీటర్లు పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. గండిబోయిన వీర మహేంద్రను అరెస్టు చేసి రిమాండ్ పంపించడం జరిగిందని తెలిపారు.


బాధితకుటుంబానికి సాయం అందజేస్తున్న ఎంఎల్ఎ

పిడుగుపాటుకు పెంకుటిల్లు ధ్వంసం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలం రామన్నపాలెం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగు పాటుకు జొన్నకూటి సుబ్బారావు పెంకుటిల్లు పూర్తిగా ధ్వంసం అయింది. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారుగా రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఇంటి యజమాని వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఘటన స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బాధితులకి రూ.5,000 ఆర్థిక సహాయం, 20 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసి ప్రభుత్వం తరపున సాయం తొందరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుల్లారావు, డిప్యూటి తహశీల్దార్, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోపాలపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిట్యాల గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు(30) శనివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అదే రోజు రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో మండలంలోని చిట్యాల గ్రామ శివారు గల మాతంగి అమ్మ వారి గుడి సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అతనినిఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెళ్లిపోయింది. మృతునికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మతిచెందాడాని తెలిపారు. మృతుని తండ్రి గంగుల వెంకట రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపురం పోలీసు స్టేషన్ నందు యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి గోపాలపురం ఎస్.ఐ కె.సతీష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం హుస్సేన్ పురం గోదావరి కాలవలో ఎస్‌సి కాలనీ వద్ద ఆదివారం సుమారు 25 ఏళ్లలోపు వయసుగల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీయించారు. మతుని వివరాలు తెలిసినవారు సామర్లకోట సిఐ సెల్ నెం.9440796568, ఎస్ఐ సెల్ నెం. 9701626505 సమాచార ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరి...?

- సమస్యలలో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- పెరిగిన ధరలకు అనుగుణంగా పెరగని బడ్జెట్
- ఆందోళనలో మిడ్ డే మీల్స్ కార్మికులు


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెట్టి ఆకలితీర్చే మధ్యాహ్న భోజన కార్మికులు అర్థాకలితో కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలల సెలవులు మినహా నెలంతా వండి పెట్టినా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 3000 మించి ఇవ్వడం లేదు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వండి వడ్డిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి వండి పెట్టడానికి అవసరమైన నూనె, పోపు గింజలు, పప్పు, ఉప్పు, చింతపండు, కూరగాయలు, వంట చెరుకు తదితర సామగ్రి కోసం రూ.4.97 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ. 7.45 పైసలు ప్రభుత్వం చెల్లిస్తోంది. కనీసం ప్రాథమిక పాఠశాలలో రూ10, హైస్కూల్ విద్యార్థులకు రూ 20 చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 100 గ్రాములు, హైస్కూల్ విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున బియ్యం సరఫరా చేస్తారు. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజులపాటు కోడిగుడ్డు కూడా ఉడికించి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ఒక్కో విద్యార్థి కోసం ఇచ్చే డబ్బు మాత్రం పెంచడం లేదు. కట్టెల పొయ్యి వాడొద్దని చెబుతూనే ప్రత్యామ్నాయంగా సబ్సిడీపై వంటగ్యాస్ అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్ఎంసి కమిటీలు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న గోరుముద్ద పేరుతో మెనూ మార్పులు చేసింది. ఆ మార్పులు తగినట్లుగా బిల్లులు పెంచలేదు. మరోవైపు ఎస్ఎంసి కమిటీలను నియమించింది. ఈ కమిటీల్లో రాజకీయ జోక్యం పెరగడంతో మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారాయి. నాణ్యత తగ్గినా, కూరలు, పప్పులు సరిపోయినంత ఇవ్వకున్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక స్థాయి పిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం వంద గ్రాముల బియ్యం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలు అల్పాహారం తీసుకునే అలవాటు లేకపోవడం అందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న 100, 150 గ్రాముల బియ్యం సరిపోకపోవడం, అదనంగా ఎస్ఎంసి కమిటీ సభ్యులు అక్కడే భోజనం చేయడం ఫలితంగా కొన్నిచోట్ల భోజనం సరిపోవడం లేదు. ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తున్నా హమాలీ ఛార్జీలు మధ్యాహ్న భోజన కార్మికులే భరించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లుతో నాణ్యత విషయంలో రాజీ పడలేక ఇంటి నుంచి అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు.

రాగిజావకు ప్రత్యేక కేటాయింపులేవీ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ చేయాలని ఆదేశించిన విషయం విధితమే. అయితే వీటి కోసం ప్రత్యేకంగా చెల్లింపులు ప్రకటించలేదు, వంట పాత్రలు సైతం అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మెస్ బిల్లులు వేతనాలు ఇప్పటికీ పెండింగ్లో ఉంటున్నాయి. మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ ఛార్జీలు కాకుండా వంట సరుకులు కూడా సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు. కట్టెల పొయ్యిపైనే వంట చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల్లో చాలామంది అస్తమా, ఎలర్జీలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. మూడు, నాలుగు నెలలకు కూడా బిల్లులు రాని పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఇంటి నుంచి పెట్టుబడి పెట్టి వండి వడ్డించాల్సి వసుంది. గౌరవ వేతనం మండల విద్యాధికారి ఖాతాలో జమవుతాయి. మండల విద్యాధికారి జిల్లా అధికారులకు బిల్లును పంపగా అక్కడ నుంచి రాష్ట్ర ఫైనాన్స్ విభాగానికి వెళ్తాయి. నిధుల లభ్యతను బట్టి ఫైనాన్స్ క్లియరెన్స్ అందితే వీరికి మూడు, నాలుగు నెలలకొకసారి డబ్బు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాన్ని పెంచడంతోపాటుగా సరుకుల ఛార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

నెలకు రూ.12వేల వేతనం ఇవ్వాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 12000 ఇవ్వాలి. గత 20 సంవత్సరాలుగా పాఠశాలల విద్యార్థులకు ఈ పథకం ద్వారా మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం వండి పెడుతున్నారు. ప్రభుత్వం చెల్లించే ధరలకు మార్కెట్‌లో సరుకులు రావడం లేదు. కట్టెల పొయ్యి వాడకం ఫలితంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నాం. నిత్యావసర సరుకులు, గ్యాస్ ప్రభుత్వం పంపిణీ చేయాలి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ 10, హైస్కూల్ విద్యార్థులకు రూ 20 చొప్పున చెల్లించాలి.

-సిహెచ్ బేబీ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు

యానాం వార్తలు

ఎంబిబిఎస్ సీట్ల వివరాల విడుదల

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను హెల్త్ సెక్రటేరియట్ అధికారులు విడుదల చేశారు. ఇందిరా గాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో మొత్తం 180 సీట్లకు గాను ప్రభుత్వ కోటాకు 131 ఆల్ ఇండియా కోటా 27, ఎన్‌ఆర్ఐ కోటా 22 సీట్లు కేటాయించారు. మహాత్మాగాంధీ మెడికల్ కళాశాల్లో బిడిఎస్‌లో యానాం-1, పుదుచ్చేరి-31, కారైకల్-8, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.రాజీవ్ గాంధీ కళాశాలలో యానాం-1,కారైకల్-8,పుదుచ్చేరి-33, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.

అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు సిఎం అంగీకారం

ప్రజాశక్తి - యానాం

యానాంలో 108 అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు పుదుచ్చేరి ప్రభుత్వం అంగీకారం తెలపడంతో డ్రైవర్లు నిరసన విరమించారు. రోజువారీ రూ.895 ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సిఎం రంగసామి అంగీకరించడం తో నిరనను విరమిస్తున్నామని ఆదివారం డ్రైవర్ల సంఘ యూనియన్ నేతలు బి. ముసలయ్య, బొడ్డు ప్రసాద్, సీహెచ్ సుబ్బారావు, బేతాళం సతీష్, రామలింగం తదితరులు తెలిపారు.


ఏడిద రోడ్డులో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు పెద్ద వంతెన, కృష్ణ టాకీస్ ఎదురుగా, ఏడిద రోడ్డులోని ఆటో స్టాండ్ సమీపంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిరూపయంగా మారాయి. పట్టణ పరిశుభ్రతలో భాగంగా గత ప్రభుత్వంలో వీటిని నిర్మించినప్పటికీ ప్రస్తుతం ఇవి వినియోగం లేకపోవడంతో పాడైపోతున్నాయి. వీటిని వినియోగంలో తీసుకు రావడంతో పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు ఇవి ఉపయోగపడతాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యర్రపోతవరం వంతెన వద్ద ఆక్రమణల పర్వం

పట్టించుకోని ఆర్ అండ్ బి శాఖ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ -యానం మెయిన్ రోడ్ లోని ఎర్ర పోతవరం వంతెన వద్ద ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే ఈ వంతెన వద్ద పలు ఆక్రమణలతో రెండు వైపులా రోడ్డును ఆక్రమించి పలు షాపులు వెలిశాయి. ఇది చాలదన్నట్లు ఇటీవల మరిన్ని ఆక్రమణలు కొనసాగుతున్నాయి చాలా మంది ఆక్రమణతోర్లు శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. ఈ ఆక్రమణల వల్ల వంతెనపై నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇక సాయంకాలం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత దారుణంగా ఉంటుంది. రోడ్డుపై బహిరంగంగా ఆక్రమణలు జరుగుతున్న రహదారి భవనాల శాఖ అధికారులు చూసి ఉన్నట్లు వ్యవహరించడంతో రోజురోజుకీ ఆక్రమణలు మరింత పెరుగుతున్నాయి. ఒకవైపు ఇరిగేషన్ అధికారులు కాలువ వైపు ఆక్రమణలు జరుగుతున్న వాళ్లు పట్టించుకున్న దాఖలాలు లేవు దీంతో మెయిన్ రోడ్డు కాలువకు ఆనుకుని అనేక బడ్డీలు వెలుస్తున్నాయి. ఆక్రమణం తొలగించి రోడ్డు విశాలం చేయాలని నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు


ఎర్ర పోతవరం వంతెనవద్ద పెరిగిపోతున్న అక్రమ కట్టడాలు

ప్రమాదకరంగా రహదారి వంతెన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం


రక్షణ గోడ విరిగి ప్రమాదభరితంగా ఉన్న రహదారి మలుపు


మండలంలోని వాకతిప్ప గ్రామ శివారులో పంట కాలువ పై ఉన్న రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఎస్ ఆకారంలో ఉన్న ఈ రహదారి మలుపులో వంతెన ఎడమవైపు రక్షణ గోడ కొంత భాగం కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే లోతైన పంట కాలువలోకి వాహనచోదకులు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితి . ఈ వంతెన రహదారిమలుపు మీదుగా వాకతిప్ప నుంచి నాగుల చెరువు కు వెళ్లే గ్రామాలతో పాటు కోరుమిల్లి, మాచర, శ్రీరాంపురం, గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని, రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామస్తులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు .

పలువురికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

కోరుమిల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సందర్భంగా గ్రామానికి చెందిన కంఠం శెట్టి సత్యం, సత్యవతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కంఠం శెట్టి ఆది నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచి త కంటి వైద్య శిబిరం లో మండపేట జయరామ్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు కంఠం శెట్టి ప్రతాప్ చౌదరి పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కేట్రాక్ట్ అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో కాకినాడ చెందిన కంటి వైద్యరాలు డాక్టర్ అరుణ, వాసంశెట్టి విజయ కుమార్, తొగరు జానకి రామయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యానికిసాయంఅందజేస్తున్నమానవతా శాఖ సభ్యులు

'మానవత' శాఖ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

పక్షవాతంతో బాధపడుతూ జీవనోపాధికి ఇబ్బంది పడుతున్న తాళ్లపూడికి చెందిన చల్లా సుబ్రహ్మణ్యంకు మండల మానవతా శాఖ ఆదివారం రూ.5వేల ఆర్థికసాయం అందజేసింది. మానవతా సభ్యులు సిహెచ్.బంగారుబాబు మరో రూ.వెయ్యి సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ అధ్యక్షులు ఎస్. సుబ్బారావు, కార్యదర్శి టి.దోసాలు, కోశాధికారి ఎ.హనుమంతరావు, రీజనల్ ఛైర్మన్ వి .చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - గోకవరం

మండల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలు ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది కలిసి బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని ఎస్ఐ శివ నాగబాబు ఆదివారం తెలిపారు. మండలంలో ఎక్కడ చట్ట వ్యతిరేక పనులను చేయరాదని, ప్రజలకు ఎటువంటి ఆటంకాలు ఉండరాదని తెలిపారు. మండల ప్రజలు దీనిపై నిబద్ధత కలిగి ఉండాలని తెలిపారు.

పట్టణంలో కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-అమలాపురం


గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

అమలాపురం పట్టణంలో ఏ వార్డు పరిధిలో ఏ వీధికి వెళ్ళినా కుక్కలబెడద తప్పటంలేదు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి ఈ సమయంలో అనేకమంది ఈ కుక్కల దాడిలో గాయపడుతున్నారు. ప్రతి రోజూ కుక్క కాటుల వల్ల ప్రభుత్వాస్పత్రికి వస్తున్న బాధితులు సంఖ్య పెరుగుతుందని ఆస్పత్రుల గణాంకాలు చెబుతున్నాయి. మున్సిపల్ అధికారులు పాలక వర్గం వీటిపై శ్రద్ధ చూపాలనే పట్టణ వాసులు కోరుతున్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా వీటి విషయంలో జోక్యం చేసుకోలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. అయితే వీటిని పట్టుకొని సుదూర ప్రాంతాల్లో వదిలి పెట్టాలని బాధ్యత అధికారులకు లేదా అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. వాటి సంఖ్య పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాలక్ష్మి గణపతి ఉత్సవాలకు రాట ప్రతిష్ట

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక ముసలమ్మ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న విద్యాలక్ష్మి గణపతి వారి గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వాహణ కోసం ం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాటముహూర్తం నిర్వహించారు. సహస్ర నామ పారాయణ, పంచామత అభిషేకం, గోక్షీర నవధాన్యాలతో భూమాత పూజ నిర్వహించి రాట ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఛైర్మన్ పెద్దిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 18 నుంచి 26 వరకు గణపతి సహస్ర నామంతో నవరాత్రి వ్రతం జరుగుతుందని తెలిపారు.

గోశాలకు ఆవు అందజేత

ప్రజాశక్తి - కడియం

కడియంలో మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాలకు రోజురోజుకు భక్తులు పోటెత్తుతున్నారు. పలువురు దాతలు గోవులకు, పశు గ్రాసాన్ని విరివిగా అందిస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన బిజెపి మండల శాఖ ఉపాధ్యక్షులు గారపాటి తాతబ్బాయి, సత్యవేణి దంపతులు రూ.30వేల విలువచేసే గిరి ఆవును ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, గోసాల కమిటీ సభ్యులు పిండి నాగరాజులకు అంది ంచారు. 6 నెలలపాటు తన కుటుంబ సభ్యులకు గల 50 సెంట్లు వ్యవసాయ భూమిలో గడ్డినిగోశాలకు అందించనున్నట్లు తాతబ్బాయి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక ఒక వ్యక్తికి గుండెపోటు వచ్చింది. అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. వివరాలు ఇవి.. చంద్రబాబు అరెస్టను చేయడంతో ఆ విషయాన్ని తట్టుకోలేక మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త జొన్నకూటి రాజు(51)కు గుండెపోటు వచ్చింది. దీంతో అతనిని కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఫోన్ లో మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రాజు మృతికి ఎంఎల్ఎ వేగుళ్ల సంతాపం తెలిపారు. టిడిపి శ్రేణులు మతిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.